క్లుప్తంగా

ఘనంగా ఘంటసాల జయంతి

దర్శి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఘంటసాల జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఘంటసాల గీతాలు నేటికీ మరువలేనివన్నారు. ఒక మహోన్నత వ్యక్తిగా ఆయన ఆలపించిన గీతాలు తెలుగు ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయన్నారు. సంఘ సేవకుడు జీవీ రత్నం మాట్లాడుతూ ఘంటసాలకు భారతరత్న అవార్డును ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, వీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో దేవాలయాలపై దాడికి నిరసన



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

కురిచేడు: బంగ్లాదేశ్‌లో హిందువుల దేవాలయాలపై జరుగుతున్న దారుణ మారణకాండకు నిరసనగా కురిచేడులో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం వద్ద నుంచి నిరసన ప్రదర్శన నిర్వహించారు. కొత్త రామకృష్ణ, యేరువ లక్ష్మీనారాయణరెడ్డి, కొత్తవెంకట అయ్యపుశెట్టి, సుబ్బారెడ్డి, యంగళ ప్రసాదరావు, రావూరి కృష్ణారావు, పిచ్చయ్య, వీరాచారి, శ్రీనివాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ సుబ్బయ్య

సాక్షి ఎఫెక్ట్..

తాళ్లూరు: కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. దీనిపై సాక్షి దినపత్రికలో 'మధ్యాహ్న భోజనంలో నాణ్యతకు తిలోదకాలు' అనే శీర్షికతో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తాళ్లూరు ఎంఈఓ–1 సుబ్బయ్య మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

వ్యాపారస్తులు సీసీ కెమెరాలు బిగించుకోవాలి

దర్శి: వ్యాపారస్తులు తమ దుకాణాల ముందు తప్పనిసరిగా సీసీ కెమెరాలు బిగించుకోవాలని డీఎస్పీ లక్ష్మీనారాయణ సూచించారు. స్థానిక తాలూకా క్లబ్ సమావేశపు హాలులో దర్శి పట్టణంలోని వ్యాపారస్తులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పట్టణంలోని వ్యాపారస్తులంతా భద్రత దృష్ట్యా తప్పనిసరిగా సీసీ కెమెరాలు బిగించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసగాళ్ల ద్వారా నష్టపోతే వెంటనే 1930 నంబర్‌కుగానీ లేదా దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కుగానీ ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సీఐ రామారావు, ఎస్సై మురళి, వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఏఎస్ పరీక్ష

దొనకొండ: మండలంలోని రామిరెడ్డిపల్లి ఎస్‌వీవీపీ ఎయిడెడ్ పాఠశాలలో 3వ తరగతి విద్యార్థులకు, దొనకొండలోని జెడ్పీ స్కూల్లో 5వ తరగతి విద్యార్థులకు బుధవారం నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మైనంపాడు డైట్ కాలేజీ విద్యార్థులు ఫీల్డ్ ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని లెక్కించి నివేదికను జిల్లా అధికారులకు పంపించనున్నారు. ఎంఈఓ–2 షేక్ అమీర్ పర్యవేక్షించారు.

ప్రగళ్లపాడులో పడకేసిన పారిశుధ్యం

- నీటి ట్యాంక్ చుట్టూ మురుగు
- మెయిన్ రోడ్డుపై గుంతలు పడటంతో నిల్వ ఉన్న వర్షం నీరు
- మురుగు కాల్వలు లేక గ్రామస్తుల అవస్థలు



ప్రగళ్లపాడులో తాగునీటి చుట్టూ నిల్వ ఉన్న మురుగు

పెద్దారవీడు: మండలంలోని ప్రగళ్లపాడు గ్రామంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. తాగునీటి ట్యాంక్ అపరిశుభ్రంగా ఉండటంతో నీరు తాగాలంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్దకాలం నాటి ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ట్యాంక్ నుంచి వృథా నీరు బయటికి పోలేక అక్కడే మురుగుగా తయారవుతోంది. అలాగే ట్యాంక్ శిథిలావస్థకు చేరి గోడలు నెర్రెలు ఇవ్వడంతో నీరు వృథాగా పోతూ చుట్టూ పాచి పట్టింది. రోజు రోజుకూ ట్యాంక్ పటిష్టత కోల్పోతోంది. ట్యాంక్ చుట్టూ కొళాయిలు లేకపోవడంతో పాటు కాలువలు నిర్మించకపోవడంతో వృథాగా పోతున్న నీరు అక్కడే నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాచి పట్టిన ట్యాంక్ నీటిని తాగలేక ఇంటిలోని అవసరాలకు మాత్రమే వాడుకుంటున్నామని, తాగడానికి రూ.10 వెచ్చించి వాటర్ ప్లాంట్ నీటిని కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు. స్థోమతలేని వారు ఆ పాచి పట్టిన ట్యాంక్ నీటినే తాగుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మెయిన్ రోడ్డుపై గుంతలు



గ్రామంలో మెయిన్ రోడ్డుపై మురుగు

పడటంతో వర్షం నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల కొద్దీ నీరు గుంతల్లో నిల్వ ఉండటంతో మురుగుగా తయారై దుర్వాసన వస్తోంది. వాసనకు ఇంటిలో భోజనాలు చేయలేక పోతున్నామని, రాత్రి అయితే దోమలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోతున్నారు. ట్యాంక్ నీటి వృథాను అరికట్టేందుకు కొళాయిలు ఏర్పాటు చేయాలని, ట్యాంక్ చుట్టూ ఉన్న మురుగును శుభ్రం చేసి, మురుగు ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లాలని అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకున్న పాపానపోలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంక్‌ను శుభ్రం చేసి, అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లాలని, వర్షం నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు ఎంపీపీ పాఠశాల నుంచి ఊరి చివర వరకు రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువలు నిర్మించాలి



గ్రామంలో ట్యాంక్ నుంచి వచ్చే వృథా నీరు, రోడ్డుపై వర్షం నీరు నిల్వ లేకుండా ఉండేందుకు కాలువలు నిర్మించాలి. మురుగు ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. మురుగుపై బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవు. మురుగు వలన రోగాల బారిన పడతామేమోనని భయంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంక్‌ను శుభ్రం చేసి, గ్రామం చివరి వరకు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి.

– మూదమంచు వల్లరాజు, ప్రగళ్లపాడు గ్రామం

పాఠశాలలో అపరిశుభ్రతపై ఎమ్మెల్యే ఆగ్రహం



పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్



పాఠశాలలో మురుగుగుంత ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

పుల్లలచెరువు: పాఠశాలలో మురుగునీరు చేరడంతో పాటు, విద్యార్థులు చేతులు కడుక్కునేందుకు నీరు శుభ్రంగా లేకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని నాయుడుపాలెం పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలకు వెళ్లగానే మురుగునీరు ఉన్న గుంట కనపడటంతో ఇలా అయితే విద్యార్థులకు రోగాలు రావా అని ఉపాధ్యాయుడిని ప్రశ్నించారు. అనంతరం విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. భోజనం బాగా పెడుతున్నారా అని విద్యార్థులను ప్రశ్నించారు. ఉపాధ్యాయుల వివరాలను అడగ్గా.. ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నామని, హెచ్‌ఎం తో మరో ఉపాధ్యాయుడు సెలవులు ఉన్నారని చెప్పడంతో హాజరు పట్టీని తనిఖీ చేశారు. హెచ్‌ఎం మాత్రమే సెలవు పెట్టి వెళ్లడం, మరో ఉపాధ్యాయుడు ఏమీ పెట్టకుండా వెళ్లడం, సీఎల్ కూడా వేయకపోవడంతో రోజూ ఇలా చేస్తారా అని ఉపాధ్యాయుడిని మందలించారు. కనీసం రాని వారికి సీఎల్ వేయాలని తెలియదా అన్నారు. విద్యార్థులకు మంచినీరు అందించే పైపులు పూర్తిగా చెడిపోవడంతో వాటిపై ఆరా తీశారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు వసతులు సక్రమంగా లేవని, విద్యార్థులు యూనిఫాం వేసుకోకుండా పాఠశాలకు వస్తున్నారని, సమస్యలు లేకుండా సరిదిద్దుకోవాలని అన్నారు. త్వరలో మండలంలో పాఠశాలలను తనిఖీ చేస్తానని, జగనన్న నాడు–నేడు కింద విద్యార్థులకు అన్ని రకాల వస్తువులను అందచేస్తే వాటిని సక్రమంగా వినియోగించుకుండా వృథా చేస్తున్నారని, మరో సారి అలా జరగకుండా చూసుకోవాలని ఎంఈవోకు సూచించారు. ఎమ్మెల్యే తో పాటు సర్పంచ్ ఆవుల కోటిరెడ్డి, సీనియర్ నాయకుడు ఉమామహేశ్వరరెడ్డి, రోసిరెడ్డి, గాలిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

వివాహ వేడుకల్లో తాటిపర్తి, ఆదిమూలపు



వైపాలెంలో వధువును ఆశీర్వదిస్తున్న తాటిపర్తి, ఆదిమూలపు



త్రిపురాంతకం వివాహ వేడుకలో పాల్గొన్న తాటిపర్తి, ఆదిమూలపు

యర్రగొండపాలెం/త్రిపురాంతకం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, పీఏసీ కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం నియోజకవర్గంలో పలు వివాహ వేడుకలకు హాజరయ్యారు. స్థానిక బాప్టిస్ట్ తెలుగు చర్చిలో నియోజకవర్గ పాస్టర్ల సంఘం అధ్యక్షుడు, దివంగత కె.విజయకుమార్ కుమార్తె వివాహానికి వారిద్దరూ హాజరయ్యారు. వీరితోపాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు షేక్ షాబీర్ బాష, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఏకుల ముసలారెడ్డి పాల్గొని ఆశీర్వదించారు. ఆదేవిధంగా త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉన్న ఫంక్షన్ హాలులో ఎంఈవో టీ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే తాటిపర్తి, మాజీ మంత్రి సురేష్ హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, ఆర్ పిచ్చయ్య, రంగబాబు, యల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: కందిలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి కే బుజ్జిబాయి సూచించారు. మండల పరిధిలో ప్రగళ్లపాడు, ఎస్ కొత్తపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కంది పంటలో మారుకా మచ్చల పురుగు పూత, కాయ ఏర్పడే సమయంలో ఉధృతి ఎక్కువగా ఉంటే దిగుబడి తగ్గుతుందన్నారు. పూత ప్రారంభ దశలో 5 శాతం వేపగింజల కషాయం లేదా వేప నూనెను కచ్చితంగా పిచికారి చేసుకోవాలని, దీని వలన రెక్కల పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ



అంబేద్కర్ నగర్‌లో మృతురాలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



సుబ్బయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం పరామర్శించారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు తూమాటి వెంకటేశ్వర్లు మాతృమూర్తి ఇటీవల మృతి చెందారు. మండలంలోని నరసాయపాలెం గ్రామ పార్టీ నాయకుడు గాయం వెంకటేశ్వరరెడ్డి అనారోగ్య కారణాలతో మృతి చెందారు. వీరి కుటుంబాలను ఆయన పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు.

ఉప సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

పుల్లలచెరువు: మండలంలోని నాయుడుపాలెం ఉపసర్పంచ్ గా ఉన్న ముటుకూరి వెంకటసుబ్బయ్య ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ బుధవారం నాయుడుపాలెం వెళ్లి సుబ్బయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని సుబ్బయ్య పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ కోటిరెడ్డి, సీనియర్ నాయకులు ఉమమహేశ్వరరెడ్డి, రోసిరెడ్డి, గాలిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ మస్తాన్‌నాయక్

పెద్దదోర్నాల: జాతీయ సాధన సర్వేలో భాగంగా మండల కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షన్ జాతీయ స్థాయి సామర్థ్యాల అంచనా పరీక్షలను మండల విద్యాశాఖాధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రవీంద్ర ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ మస్తాన్‌నాయక్, ఏపీ మోడల్ పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ కొండలరావు పరిశీలించారు. పరీక్షలకు హాజరైన విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలను తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణపై పరిశీలకులకు సూచనలు చేశారు. ఈ పరీక్షల ద్వారా జాతీయ స్థాయిలో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయనున్నట్లు తెలిపారు.

జాగ్రత్తలతో బొబ్బర తెగులు నివారణ



రైతులకు బొబ్బర తెగులుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న ఏవో నిర్మలాదేవి

పుల్లలచెరువు: ప్రస్తుతం మిరప పంటలో బొబ్బర తెగులు ఎక్కువగా ఉందని, తగు జాగ్రత్తలు తీసుకుంటూ కొంత మేరకు నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి నిర్మలదేవి అన్నారు. మండలంలోని నాయుడుపాలెం, పీవీపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేసిన పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొబ్బర తెగులును వావలాకు కషాయంతో నివారించుకోవచ్చుని తెలిపారు. దీనికోసం 10 లీటర్ల నీటిలో 10 కేజీల వావలాకు ఉడికించి, వడపోసి 100 గ్రాముల సబ్బుపొడిని కలిపి అదే రోజు పిచికారి చేయాలని సూచించారు. కందిలో గూడు పురుగు ఉందని, దాని నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉద్యానవన అధికారి రామయ్య మాట్లాడుతూ ఉద్యానవనశాఖ ద్వారా రైతులకు రాయితీపై వచ్చే పథకాలను వివరించారు. వావలాకు కషాయం ఎలా తయారు చేయాలో రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కాశయ్య తయారు చేసి వివరించారు. కార్యక్రమంలో వీఏఏ లు నబీరుస్సాభాను, మస్తాన్, గాలిరెడ్డి, యోగిలక్ష్మి, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



విద్యుత్‌షాక్ తో మృతి

పుల్లలచెరువు: విద్యుత్ షాక్‌తో లక్ష రూపాయల విలువైన గేదె మృతిచెందిన సంఘటన మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామంలోని రామాలయం వీధిలో మెయిన్ విద్యుత్ వైర్లు తెగడంతో అందులోని ఒక తీగె గ్రామానికి చెందిన రైతు జిడ్డు గోవింద్ ఇంటి దగ్గర ఉన్న రేకుల షెడ్‌పై పడింది. అది ఎత్తు తక్కువ కావడంతో గేదె దానికి తగలడంతో షాక్ తగిలి మృతి చెందింది. ఉదయాన్నే రైతు లేచి చూసేసరికి గేదె మృతిచెందంతో కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో పాటు గ్రామంలో చాలా ఇళ్లలో టీవీలు, ఇళ్లలోని తీగెలు కూడా పూర్తిగా కాలిపోయాయి. గ్రామస్తుడు ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్ తీగెలు తుప్పుపట్టడంతో తెగిపోతున్నాయని, మంగళవారం రాత్రి ప్రజలు తిరిగే సమయంలో తీగెలు తెగిపోయుంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని, అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని అన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోతే కార్యాలయం ముందు ధర్నాలు చేయాల్సి వస్తుందని అన్నారు. రైతు కుటుంబానికి నష్టపరిహారం అందజేయాలని ఆయన కోరారు.

రేపటి నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

పెద్దారవీడు: మండల పరిధిలో గ్రామ రెవెన్యూ సదస్సులు 6వ తేదీ నుంచి జనవరి 3 వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శైలేంద్రకుమార్ బుధవారం సాయంత్రం తెలిపారు. 6న బద్వీడు రెవెన్యూ పరిధిలో బద్వీడుచెర్లోపల్లి సచివాలయంలో, 7న మద్దలకట్ట గ్రామ సచివాలయంలో, 9న బోయిదగుంపుల గ్రామ సచివాలయంలో, 10న పెద్దారవీడు గ్రామ సంచాయతీ కార్యాలయంలో, 12న కంభంపాడు ఎంపీపీ పాఠశాలలో, 17న ప్రగళ్లపాడు ఎంపీపీ పాఠశాలలో, 19న చట్లమిట్ల ఎంపీపీ పాఠశాలలో, 21న తంగిరాలపల్లి ఎంపీపీ పాఠశాలలో, 24న తోకపల్లి ఎంపీపీ పాఠశాలలో, 26న చట్లమిట్ల రెవెన్యూ పరిధిలోని పొతంపల్లి గ్రామానికి చట్లమిట్ల ఎంపీపీ పాఠశాలలో, 28న సానికవరం గ్రామ సచివాలయంలో, 31న పెద్దారవీడు రెవెన్యూ పరిధిలో పుచ్చకాయలపల్లి గ్రామ సచివాలయంలో, 2న ఎస్ కొత్తపల్లి, 3న దేవరాజుగట్టు గ్రామాల వారికి దేవరాజుగట్టు గ్రామ సచివాలయం, 4న ఓబులక్కపల్లి, 7న అంబాపురం గ్రామాలకు ఓబులక్కపల్లి ఎంపీపీ పాఠశాలలో, 8న గొబ్బూరు గ్రామ సచివాలయంలో సదస్సులు నిర్వహిస్తారని, సుంకేసుల, కలనూతల రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిన్నెర శాంతి తెలిపారు. తమ భూములకు సంబంధించిన సమస్యలు, వివాదాలు ఏమైనా ఉంటే ఈ సదస్సుల్లో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సదస్సులు ఈ నెల 6వ తేదీ నల్లగుంట్ల, 7న చిలకచర్ల గూడెం, 10న వై.చర్లోపల్లి, 12న యడవల్లి, కొత్తూరు, 13న గంటవానిపల్లె, 17న ఐనముక్కల, కడపరాజుపల్లె, 19న దోర్నాల, తిమ్మాపురం, 21న హసానబాద, జమ్మిదోర్నాల, 24న చిన్నదోర్నాల, 26న చిన్నగుడిపాడు, 28న కటకానిపల్లె, చింతల అగ్రహారం, 31న రామచంద్రకోట, జనవరి 2న పెద్దబొమ్మలాపురం, 4న బోడేనాయక్ తాండా, 7న చింతల గిరిజన గూడెంలో జరుగుతాయని ఆమె తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

దర్శి: రోడ్డు ప్రమాదంలో ముండ్లమూరు మండలం లక్ష్మీనగర్‌కు చెందిన నాగార్జున అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దర్శి మండలంలోని తూర్పువీరాయపాలెం గ్రామ సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కట్టెల ట్రాక్టర్‌లో నుంచి కట్టెలు కిందపడగా, చీకట్లో అవి కనపడక మోటారు సైకిల్‌పై వెళ్తున్న నాగార్జున కట్టెలపైకి ఎక్కి కిందపడి గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు ఓ ప్రైవేటు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఆర్‌ఎంపీలకు అవగాహన కార్యక్రమం

దొనకొండ: గ్రామాల్లో ప్రజలకు వైద్యం చేసే ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స వరకే పరిమితం కావాలని వైద్యాధికారి ఎం.సునీత సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆర్‌ఎంపీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోగులు వచ్చినప్పుడు ప్రథమ చికిత్స మాత్రమే చేసి ప్రభుత్వ వైద్యశాలలకు పంపించాలని ఆర్‌ఎంపీలకు సూచించారు. అలా కాకుండా చాలా మంది ఆర్‌ఎంపీలు తమ వద్దనే రెండుమూడు రోజుల రోగులను ఉంచుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సెలైన్‌లు, యాంటీబయోటిక్ ఇంజక్షన్లు ఇవ్వవద్దని, మహిళలకు సంబంధించిన జబ్బులలో జోక్యం చేసుకోకూడదని, పరిధికి మించి వైద్యం చేయవద్దని స్పష్టం చేశారు. ఆర్‌ఎంపీలు ఐడీ కార్డు, పర్మిషన్లు పొంది ఉండాలని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.రమాదేవి, ఎస్‌ఐ కె.విజయ్‌కుమార్, ఆర్‌ఎంపీలు పాల్గొన్నారు.

గడువులోగా ఫసల్ బీమాకు నగదు చెల్లించాలి

తాళ్లూరు: పీఎం ఫసల్ బీమా పథకం ప్రీమియం చెల్లింపునకు గడువు త్వరలో ముగుస్తుందని, రైతులంతా వెంటనే చెల్లించాలని ఏవో బి.ప్రసాదరావు సూచించారు. మండలంలోని మల్కాపురం, విఠలాపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. వ్యవసాయాధికారి ప్రసాదరావు అధ్యక్షత వహించారు. రైతుల పొలాలను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. బీమా ప్రీమియంను సీఎస్‌సీ సెంటర్లలోగానీ, సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల వద్దగానీ బీమా నగదు చెల్లించి రసీదు తీసుకోవాలన్నారు. అలాగే రైతు సేవా కేంద్రాల్లో ఈ పంట నమోదు చేయించుకోవాలని ఏవో కోరారు. కార్యక్రమంలో వీఏఏ అశోక్, మార్టిన్, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

దొనకొండ: పంచాయతీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 8 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య డిమాండ్ చేశారు. ఆ మేరకు బుధవారం పంచాయతీ కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. 8 నెలల నుంచి వేతనాలు లేక ఇల్లు గడవటం లేదని, అప్పులు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, పిల్లలకు ఫీజులు, వంట గ్యాస్, కరెంట్ బిల్లులు, ఇంట్లో వారికి ఆరోగ్యం బాగలేకపోతే హాస్పిటల్లో చూపించడానికి కూడా ఇబ్బందిగా ఉందని కార్మికులు వాపోయారు. ప్రస్తుతం అప్పు ఇచ్చే వారు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, క్రిస్మస్ పండుగలోపు పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా స్వచ్ఛభారత్ కార్మికులకు 3 నెలల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు కుందుర్తి అనిల్, పలువురు పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

దర్శి ఎస్సీ హాస్టల్లో విద్యార్థులకు వసతులు కల్పించాలి

దర్శి: స్థానిక ఎస్సీ హాస్టల్లో విద్యార్థులకు వసతులు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ కుమార్ కోరారు. బుధవారం హాస్టల్‌ను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ హాస్టల్ భవనం వారికి ప్రభుత్వం అద్దెలు చెల్లించకపోవడం వలన వారు వసతులు కల్పించలేకపోతున్నారన్నారు. హాస్టల్లో 60 మంది విద్యార్థులు ఉండగా తలుపులు కూడా లేని రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయని చెప్పారు. తాగటానికి బోరింగు నీరే దిక్కని, అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలతో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. ఒకే వర్కర్ ఉండటంతో సమయానికి భోజనాలు కూడా పెట్టడం లేదన్నారు. విద్యార్థులు సొంత డబ్బుతో ఫ్యాన్లు ఏర్పాటు చేసుకున్నారని, విద్యుత్ వైర్లు తెగి వేలాడుతున్నాయని అన్నారు. ఏ అధికారి వచ్చినా పట్టించుకోవడం లేదని చెప్పారు. అధికారులు స్పందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కే విజయ్, సీఐటీయూ నాయకులు తాండవ రంగారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తమపై ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శుల వినతి

కురిచేడు: పంచాయతీ విధులతో పాటు అదనపు విధులు అప్పగించి తమపై ఒత్తిడి పెంచుతున్నారని పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ సతీష్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. సచివాలయంలో ఎవరూ లేకపోయినా వారి విధులు, ప్రభుత్వం చేయించే అదనపు పనులు, పంచాయతీలో నిర్వహించాల్సిన రోజువారీ విధులతో పాటు ఎవరైనా పంచాయతీ కార్యదర్శులు లేకపోతే వారి విధులు కూడా తామే నిర్వహించడం మానసికంగా, శారీరకంగా చాలా ఒత్తిడికి కారణమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

కురిచేడు: స్థానిక ఎస్‌ఎస్‌పీ కాలనీలోని భవిత సెంటర్‌లో బుధవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓ సుబ్బారావు, వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జీఎస్‌ఆర్ సాయి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను సమాజంలో చిన్న చూపు చూడవద్దని, అందరూ సమానమేనని అన్నారు. భవిత సెంటరులో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను తల్లిదండ్రులు భవిత సెంటరుకు పంపాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎలిమెంటరీ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, ఐఈఆర్టీ వెంకట్రావు, సురేష్, గురువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు బానిసలు కావద్దు

దొనకొండ: విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ కె.విజయ్‌కుమార్ సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదువుకుని సమాజానికి, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తెచ్చి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు అధికంగా జరుగుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.